క్లుప్తంగా

మంచినీటిని వృథా కానివ్వొద్దు

ఎంపీడీఓ వెంకయ్య



మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకయ్య

శంకర్‌పల్లి: గ్రామాల్లో మంచినీరు ఎక్కడ వృథా కాకుండా సక్రమంగా ఉపయోగించుకునేలా చర్యలు తీసుకోవాలని శంకర్‌పల్లి ఎంపీడీఓ వెంకయ్య అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో మంచినీటి సహాయకులకు శిక్షణ శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. పైపులైన్ లీకేజీలను ఎప్పటికప్పుడూ గుర్తించి, మరమ్మతులు చేయాలన్నారు. విధుల్లో ఎవరూ నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఎంపీడీఓ హెచ్చరించారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, మంచినీటి సహాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించండి



నోడల్ అధికారి చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఉపాధ్యాయులు

కేశంపేట: ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్షుడు రామ్మోహన్ అన్నారు. బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలని కోరుతూ మండల కేంద్రంలో మంగళవారం మండల నోడల్ అధికారి చంద్రశేఖర్‌కు టీఎస్ యూటీఎఫ్ సంఘం సభ్యులు, బదిలీ అయిన ఉపాధ్యాయులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రామ్మోహన్ మాట్లాడుతూ.. మండలంలో చాలా మంది ఉపాధ్యాయులకు బదిలీలు జరిగాయన్నారు. బదిలీ అయిన ఉపాధ్యాయుల స్థానంలో మరో ఉపాధ్యాయుడు రాకపోవడంతో మండలంలో చాలా మంది ఉపాధ్యాయులను రిలీవ్ చేయలేదన్నారు. బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేసిన తర్వాత ఉపాధ్యాయుల సర్దుబాటు చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి రవికుమార్, ప్రకాశ్, వెంకటేశ్, చిన్నారావు పాల్గొన్నారు.

నేల సారవంతాన్ని కాపాడుకోవాలి

ఏరువాక కేంద్రం తాండూర్ కో–ఆర్డినేటర్ లక్ష్మణ్




మాట్లాడుతున్న కో-ఆర్డినేటర్ లక్ష్మణ్

చేవెళ్ల: రైతులు నేల సారవంతాన్ని కాపాడుకోవాల్సిన ఆవశ్యకత, అవసరం ఎంతైనా ఉందని ఏరువాక కేంద్రం తాండూర్ కో–ఆర్డినేటర్ టి.లక్ష్మణ్, శాస్త్రవేత్త టి.యమున అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం రైతులకు భూసార పరీక్షలు, భూసార ఆధారిత ఎరువుల యాజమాన్యం, పంటల చీడపీడల నివారణలో జీవ రసాయనాల ప్రాముఖ్యతపై తాండూర్ ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అధిక మోతాదులో రసాయనిక ఎరువులను వాడడంతో నేల నిస్సారమవడమే కాకుండా కాలుష్యం కూడా పెరుగుతుందన్నారు. దీంతో పంట దిగుబడి తగ్గుతుందన్నారు. వివిధ పంటలలో పురుగులు, తెగుళ్ల నివారణ, జీవ రసాయనాల ప్రాముఖ్యత గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ఏడీఏ సురేశ్‌బాబు, ఏఓ శంకర్‌లాల్, ఏఈఓలు బాలకోటేశ్వర్‌రావు, స్వాతిప్రియ, రమ్య, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్



మానవహారంగా నిల్చున్న విద్యార్థులు

శంకర్‌పల్లి: విద్యార్థులు అవకాశం ఉన్నంతవరకు ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటి, సంరక్షించాలని శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం స్వచ్ఛతా హీ సేవలో భాగంగా కేజీబీవీలో విద్యార్థులతో స్వచ్ఛ ప్రతిజ్ఞ, మావనహారం వంటి కార్యక్రమాలను చేపట్టారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, ఎల్లప్పుడూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం స్థానిక కౌన్సిలర్ శ్రీనాథ్‌తో కలిసి మొక్కలు నాటి, నీరు పోశారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ మధురవాణి, మున్సిపల్ మేనేజర్ అంజన్‌కుమార్, పర్యావరణాధికారి ఆనంద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ తెగిన వెంకిర్యాల వంతెన

వరదనీటితో వాగుపై రాకపోకలు బంద్



వరద ఉధృతికి తెగిపోయిన తాత్కాలిక వంతెన

కొందుర్గు: గత రెండురోజులుగా కురుస్తున్న వర్షానికి వెంకిర్యాల వాగులో వరదనీరు ప్రవహించడంతో సోమవారం రాత్రి మళ్లీ వెంకిర్యాల వాగుకు సంబంధించి తాత్కాలిక రోడ్డు తెగిపోయింది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. కొందుర్గు మండల కేంద్రం నుంచి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి వెళ్లే ఆర్అండ్‌బీ రహదారిలో ఉన్న వెంకిర్యాల వంతెన శిథిలావస్థకు చేరడంతో ఈ వంతెన నిర్మాణానికి ప్రభుత్వం 2023లోనే ఎఫ్‌డీఆర్ నిధుల్లో నుంచి రూ.3.20లక్షలు మంజూరు చేసింది. పనుల ప్రారంభం కోసం టెండర్ పూర్తయ్యింది. అప్పటి ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ 2023 జూన్ 23న భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. వంతెన నిర్మాణానికి పునాదులు తీసి ఏడాది గడిచింది. అయినా ప్రస్తుతం వంతెన నిర్మాణం పునాదులకే పరిమితంగా మారింది. కాగా నూతనంగా వంతెన నిర్మాణం కోసం ఉన్న పాత వంతెనను తొలగించారు. అయితే ఆగస్టులో కురిసిన భారీ వర్షాలకు వాగులో వరదనీరు రావడంతో ఈ రోడ్డుపై వెళ్లే వాహనాలకు ఆటంకం ఏర్పడింది. ఈ సందర్భంగా అప్పట్లో అధికారులు, నాయకులు స్పందించి వాగుకు తాత్కాలిక వంతెన ఏర్పాటు చేశారు. కాగా సోమవారం రాత్రి కురిసిన వర్షానికి ఈ రోడ్డు సైతం తెగిపోయి రాకపోకలు నిలచిపోయాయి. దీంతో మండలంలోని వెంకిర్యాల, ఆగిర్యాల, లక్ష్మిదేవిపల్లితోపాటు జిల్లేడ్ చౌదరిగూడ మండలం కాస్లాబాద్, ఎదిర, రావిర్యాల తదితర గ్రామాల ప్రజలకు కొందుర్గు మండల కేంద్రానికి రావడానికి ఇబ్బందిగా మారింది. అదేవిధంగా కొందుర్గు మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల ప్రజలు మహబూబ్‌నగర్ వెళ్లడానికి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అధికారులు ఇప్పటికైనా స్పందించి వంతెన నిర్మాణం పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

108 ట్రాఫిక్ కేసులు పరిష్కారం

చేవెళ్ల కోర్టు ఆవరణలో రెండోరోజు కొనసాగిన లోక్ అదాలత్



కేసులు పరిష్కరిస్తున్న రిటైర్డు జడ్జి సాంబశివుడు

చేవెళ్ల: వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ రూల్స్‌ను పాటించాలని రిటైర్డు జడ్జి సాంబశివుడు సూచించారు. చేవెళ్ల కోర్టు ఆవరణలో మంగళవారం రెండోరోజు జరిగిన ట్రాఫిక్ పోలీస్ కేసులపై లోక్ అదాలత్‌లో పలు కేసులు పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేవెళ్ల ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన ట్రాఫిక్ పెండింగ్ కేసులను పరిష్కరించుకునేందుకు ఈ ప్రత్యేక లోక్ అదాలత్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో 108 మద్యం తాగి వాహనాలు నడిపించిన కేసులు పరిష్కరించటంతో పాటు వీరికి 2 లక్షల 93,500ల జరిమానలు విధించినట్లు చెప్పారు. ట్రాఫిక్ కేసులకు సంబంధించిన అన్ని కేసులను ఈ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకునేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. ఈ నెల 28వ తేదీవరకు ఈ లోక్ అదాలత్ కొనసాగుతుందన్నారు. చేవెళ్ల డివిజన్‌ల పరిధిలోని నాలుగు మండలాల పోలీసు స్టేషన్‌ల పరిధిలో కేసులు నమోదైన వారు ఈ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పేదల ఆరోగ్య సంరక్షణకు చర్యలు

డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి



వైద్య శిబిరంలో కార్మికులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ విజయలక్ష్మి

షాద్‌నగర్: నిరుపేదల ఆరోగ్య సంరక్షణకు వైద్యారోగ్య శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి తెలిపారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం చించోడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మండల పరిధిలోని మొగిలిగిద్ద గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని డిప్యూటీ డీఎంహెచ్ఓ సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీజనల్‌గా వచ్చే వ్యాధుల పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మలేరియా, డెంగీ, చికున్‌గున్యా, టైఫాయిడ్ తదితర వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందని, ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్య సంరక్షణ విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గ్రామంలో 30 ఏళ్ల వయస్సు దాటిన వారందరూ విధిగా బీపీ, షుగర్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ వ్యాధులు వచ్చిన వారికి ప్రభుత్వం ఉచితంగా మందులు పంపిణీ చేస్తుందన్నారు. అదేవిధంగా ఇళ్లలో దోమలు రాకుండా తగిన చర్యలు చేపట్టాలని, వేడి ఆహారాన్ని తినాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. అదేవిధంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తద్వారా రోగాలను నియంత్రించవచ్చన్నారు. ఏ చిన్న ఆరోగ్య సమస్య వచ్చినా వెంటనే ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లి చికిత్స చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ జయంత్‌రెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, డాక్టర్ ప్రవీణ, హెల్త్ సూపర్‌వైజర్ చంద్రకళ, పంచాయతీ కార్యదర్శి సయ్యద్ బాషిద్, ఏఎన్ఎంలు అనురాధ, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలతోనే రోగాలు దూరం

ఎంపీడీఓ అపర్ణ



చందనవెల్లిలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

షాబాద్: ప్రజలు ముందస్తు జాగ్రత్తలు పాటిస్తేనే రోగాలు ధరిచేరవని ఎంపీడీఓ అపర్ణ పేర్కొన్నారు. మంగళవారం షాబాద్, చందనవెల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో గ్రామ పంచాయతీ సిబ్బందికి మెడికల్ క్యాంపు నిర్వహించారు. అనంతరం కేజీబీవీలో విద్యార్థులకు స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంపై అవగాహన కల్పించి విద్యార్థులతో స్వచ్ఛతా ప్రతిజ్ఞ, మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే రోగాలకు దూరంగా ఉండొచ్చన్నారు. వైద్య సిబ్బందితో కలిసి పారిశుద్ధ్య నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. జ్వర అనుమానితుల నుంచి వైద్య సిబ్బంది రక్త నమూనాలు సేకరించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీఓ శ్రీనివాస్, ఏపీఓ వీరాసింగ్, అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, తదితరులు ఉన్నారు.

దస్తావేజు లేఖరులకు లైసెన్సులు ఇవ్వాలి

దస్తావేజుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటయ్య



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

షాద్‌నగర్: దస్తావేజు లేఖరులకు ప్రభుత్వం లైసెన్సులు జారీ చేయాలని దస్తావేజుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటయ్య కోరారు. మంగళవారం షాద్‌నగర్ దస్తావేజు సంఘం నాయకులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేసి సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ.. గత ఇరవై ఏళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం రిజిస్ట్రేషన్లు, స్టాంపుల శాఖను ప్రక్షాళన చేసి దస్తావేజు లేఖరుల లైసెన్సులను రద్దు చేసినట్లు తెలిపారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటై ప్రభుత్వాలు మారినా నేటివరకు తమ సమస్య మాత్రం తీరడం లేదన్నారు. లైసెన్సులు జారీ చేయాలని ఎన్నో ఏళ్లుగా డిమాండ్ చేస్తున్నా అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య దస్తావేజు లేఖరులు వారధిగా పనిచేస్తారని, ప్రభుత్వం లైసెన్సులు జారీ చేస్తే ఎంతో మందికి ఉపాధి కలుగుతుందని పేర్కొన్నారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే లైసెన్సుల జారీ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. కార్యక్రమంలో రాజు, రహమత్, కరీం, మల్లేశ్‌యాదవ్, అనిల్‌కుమార్, బస్వరాజ్, మోహన్, మార్గం రాజేశ్, ఇమ్రాన్, ఆదం, సతీశ్, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే అభివృద్ధి సాధ్యం

షాద్‌నగర్: విద్యతోనే అభివృద్ధి సాధ్యమని మాజీ సర్పంచ్ సుమన అన్నారు. మండల పరిధిలోని విఠ్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గతేడాది పదోతరగతి పరీక్షా ఫలితాల్లో తెలుగు, హిందీ సబ్జెక్టుల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించినందుకుగాను ఉపాధ్యాయులను ప్రగతి వెల్ఫేర్ సొసైటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బూర్గుల గ్రామంలో ఉన్న ప్రగతి వెల్ఫేర్ సొసైటీలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ సర్పంచ్ సుమన మాట్లాడుతూ.. పేద విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాటలు వేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఈ సందర్భంగా హెచ్ఎం ఆవుల రవి, తెలుగు, హిందీ ఉపాధ్యాయులు మల్లేశ్, రవికాంత్‌ను సొసైటీ సభ్యులు ఘనంగా సన్మానించడంతో పాటుగా మెమెంటోలను అందజేశారు. వచ్చే పదో తరగతి వార్షిక ఫలితాల్లో పది జీపీఏ సాధించిన విద్యార్థులకు ఒక్కొక్కరికి ఐదు వేల నగదు బహుమతి ఇవ్వనున్నట్లు హెచ్ఎం తెలిపారు.

హెచ్‌సీయూకు విద్యార్థిని ఎంపిక

కేశంపేట: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ దేశ వ్యాప్తంగా నిర్వహించిన ఇంటిగ్రేటెడ్ ఎలిజిబులిటీ పరీక్షలో మండల పరిధిలోని ఎక్లాస్‌ఖాన్‌పేట గ్రామానికి చెందిన మాధపురం నందిని అర్హత సాధించింది. ఆమె పదోతరగతి వరకు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో, ఇంటర్మీడియట్ కొత్తపేటలోని ప్రభుత్వ కాలేజీలో చదివినట్లు గ్రామస్తులు తెలిపారు. హెచ్‌సీయూకి ఎంపిక కావడంతో పాఠశాల ఉపాధ్యాయులు, కాలేజీ అధ్యాపకులు, గ్రామస్తులు ఆమెను అభినందించారు.

సైబర్ మోసాలపై అప్రమత్తత అవసరం

చేవెళ్ల: ఆన్‌లైన్ మోసాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని షీటీమ్ సభ్యులు రవీందర్, రేష్మ, మల్లేశ్ అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ హెచ్ఎస్ బాలికల పాఠశాలలో మంగళవారం షీటీమ్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు షీటీమ్, సైబర్ నేరాలు, మానవ అక్రమ రవాణా, మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా షీటీమ్ సభ్యులు మాట్లాడుతూ.. విద్యార్థులు గుర్తు తెలియని వ్యక్తులు మీ పట్ల ఇబ్బంది కలిగించేలా ప్రవర్తిస్తే వెంటనే 100 డయల్‌కు ఫోన్ చేయాలని సూచించారు. సైబర్ నేరాల గురించి 1930కి, బాల్య వివాహాలు, చిన్న పిల్లలకు ఎదైనా ఇబ్బంది చైల్డ్ లైన్ హెల్ప్ లైన్ నెం.1098కి ఈవ్‌టీజింగ్‌కి లేదా సైబరాబాద్ వాట్సాప్ నంబర్ 8712663061కి సమాచారం అందించాలని సూచించారు. సోషల్ మీడియా, ఓటీపీ ఫ్రాడ్స్, ఆన్‌లైన్ గేమ్స్‌పై జాగ్రత్తలు వహించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఉన్నీసా, ఉపాధ్యాయులు, షీటీమ్ సిబ్బంది ఉన్నారు.

దంచికొట్టిన వాన



అమ్డాపూర్‌లో కురుస్తున్న వర్షం

మొయినాబాద్‌రూరల్: మబ్బుపడిన ఆకాశం.. రోజంతా మబ్బులతో ఉండి ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు మేఘాలతో మబ్బులుపడిన ఆకాశం సాయంత్రం వేళ రెండు గంటలపాటు ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. దీంతో వాహనాదారులు, ప్రయాణికులు అనేక ఇబ్బందులు పడ్డారు. పంటపొలాల్లో భారీగా వర్షపునీరు చేరింది. గత 15 రోజుల నుంచి అడపదడపా కురుస్తున్న వర్షాలతో పాటు మంగళవారం ఒక్కసారి మళ్లీ భారీ వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది.

బెల్టు దుకాణాలను తొలగించాలి

ఎమ్మెల్యేకు కిషన్‌నగర్ గ్రామస్తుల వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న కిషన్‌నగర్ గ్రామస్తులు

షాద్‌నగర్‌రూరల్: మండల పరిధిలోని కిషన్‌నగర్ గ్రామంలో బెల్టు దుకాణాలను తొలగించాలని కోరుతూ పలువురు గ్రామస్తులు మంగళవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు వినతిపత్రం అందజేశారు. నిత్యం పగలు, రాత్రి అనే తేడా లేకుండా బెల్టు దుకాణాల ద్వారా గ్రామంలో జోరుగా మద్యాన్ని విక్రయిస్తున్నారని, దీంతో మద్యానికి బానిసలైన కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని పేర్కొన్నారు. విపరీతంగా మద్యం విక్రయించడం ద్వారా యువత చెడుకు బానిసలవుతున్నారన్నారు. బెల్టు దుకాణాలను మూసి వేయాలని డిమాండ్ చేస్తూ మూడురోజులుగా గ్రామంలో నిరాహార దీక్ష చేపట్టినా అధికారులు ఎవరూ చర్యలు చేపట్టలేదని ఆరోపించారు. గ్రామంలో మద్యం విక్రయాలను నిలిపివేస్తే గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యేను కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో గ్రామస్థులు శేఖర్, విఠ్యాల మల్లేశ్, చిల్కమర్రి యోగి, జోగుభూషణ్, యాదగిరి, ఎల్లంపల్లి శ్రీను, నల్ల శ్రీశైలం తదితరులు ఉన్నారు.

టెంట్ తొలగించడం సరికాదు

కిషన్‌నగర్ గ్రామంలో బెల్టు దుకాణాలను తొలగించాలని డిమాండ్ చేస్తూ దీక్ష చేపట్టిన శేఖర్‌ను మంగళవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి పరామర్శించారు. బెల్టు దుకాణాలను తొలగించాలని పోరాటం చేస్తున్న శేఖర్ ధర్నా చేస్తుంటే పోలీసులు ధర్నాకు అనుమతి లేదని టెంటును తొలగించడం సరికాదన్నారు. మంచి కోసం పోరాటం చేస్తున్న వారిని ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో విఠ్యాల నర్సింలు, వంశీచంద్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, కుమ్మరి లింగం, ఆంజనేయులు, కృష్ణయ్య, శ్రీనివాస్, యాదయ్య, బిజ్జ శ్రీనివాస్, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



విద్యార్థులకు మెమెంటో అందజేస్తున్న ప్రిన్సిపాల్ చిన్నపురెడ్డి, ఉపాధ్యాయులు

చేవెళ్ల: జోనల్ స్థాయిలో జరిగిన అండర్–14 విభాగం ఖోఖో పోటీలో తమ పాఠశాల విద్యార్థులకు ద్వితీయ బహుమతి రావటంపై చేవెళ్ల మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ చిన్నపురెడ్డి హర్షం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో మంగళవారం విజయం సాధించిన ఖోఖో జట్టు విద్యార్థినులను అభినందించి భవిష్యత్‌లో మరింతగా రాణించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శంకర్‌పల్లి జోనల్‌స్థాయి క్రీడాపోటీల్లో చేవెళ్ల, శంకర్‌పల్లి, షాబాద్ మండలాలకు చెందిన విద్యార్థులకు షాబాద్ మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన అండర్–14 ఖోఖో బాలికల విభాగంలో చేవెళ్ల మోడల్ స్కూల్ విద్యార్థినుల జట్టు ద్వితీయ స్థానంలో నిలిచారని చెప్పారు. చదువుతో పాటు క్రీడల్లో విద్యార్థులకు తగిన ప్రాధాన్యతను అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు జిల్లాస్థాయిలో జరిగే పోటీల్లో కూడా రాణించాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

ప్రహరీ తొలగింపు



జేసీబీ సహాయంతో గోడను తొలగిస్తున్న అధికారులు

షాద్‌నగర్‌రూరల్: మండల పరిధిలోని లింగారెడ్డిగూడ గ్రామ శివారులో వీరమోని చెరువు నీటి ప్రవాహానికి అడ్డంగా నిర్మించిన ప్రహరీని మంగళవారం అధికారులు తొలగించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వీరమోని చెరువు నిండి కాల్వల ద్వారా నీరు కిందకు ప్రవహిస్తోంది. కానీ పలువురు రైతులు పాత జాతీయ రహదారి పక్కన నీటి ప్రవాహానికి అడ్డంగా వ్యవసాయ పొలం చుట్టూ సిమెంట్ పలకల సహాయంతో గోడ నిర్మించారు. వాస్తవాలను పరిశీలించి నీటి వనరులకు ఆటంకం కలగకుండా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. దీంతో స్పందించిన ఆర్అండ్‌బీ, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖలకు సంబంధించిన అధికారులు చర్యలు చేపట్టారు. నీటి ప్రవాహానికి అడ్డంగా సిమెంట్ పలకలతో నిర్మించిన గోడను జేసీబీ సహాయంతో తొలగించారు.

రైతు దీక్షను విజయవంతం చేయండి

కేశంపేట: రుణమాఫీ కాని రైతులతో 26న మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద నిర్వహించ తలపెట్టిన రైతు దీక్షలో రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని రైతు ఐక్యవేదిక నాయకుడు శివాజీ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ పథకంతో రైతులను మోసం చేస్తోందని విమర్శించారు. ఈ సమావేశానికి మండలంలోని వివిధ గ్రామాల నుంచి రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఎంఎంటీఎస్‌ను పొడిగించండి

ఎంపీ డీకే అరుణకు నేతల వినతి



ఎంపీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

షాద్‌నగర్: ఎంఎస్‌టీఎస్ రైలును శంషాబాద్ నుంచి షాద్‌నగర్ వరకు పొడిగించాలని కోరుతూ పలువురు బీజేపీ నేతలు ఎంపీ డీకే అరుణను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంగళవారం షాద్‌నగర్‌కు చెందిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు నాయకులు మహబూబ్‌నగర్‌లోని ఎంపీ నివాసానికి వెళ్లి ఆమెకు వినతిపత్రం అందజేశారు. షాద్‌నగర్ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుందని, శంషాబాద్ వరకు నడిపిస్తున్న ఎంఎంటీఎస్ రైలును షాద్‌నగర్‌కు వరకు నడిపిస్తే విద్యార్థులు, వ్యాపారులు, ఉద్యోగులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. రాష్ట్ర రాజధానికి నిత్యం వేల మంది షాద్‌నగర్ నుంచి రాకపోకలు కొనసాగిస్తున్నారన్నారు. అదేవిధంగా హంద్రీ ఎక్స్‌ప్రెస్ రైలును మలక్‌పేటలో ఆపే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన డీకే అరుణ రైల్వే శాఖ మంత్రి, అధికారుల దృష్టికి త్వరలో తీసుకెళ్లి ప్రయాణికులకు ఉపయోగపడే విధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు ఇస్నాతి శ్రీనివాస్, మోహన్‌సింగ్, సుధాకర్, మల్లేశ్ తదితరులు ఉన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

బీజేపీ మండల అధ్యక్షుడు కిరణ్



షాబాద్: బీజేపీ సభ్యత్వ నమోదు నిర్వహిస్తున్న నాయకులు

షాబాద్: గ్రామాల్లో బీజేపీ బలోపేతానికి ప్రతీ కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు కిరణ్, సీనియర్ నాయకుడు పీసరి సతీశ్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఏట్లఎర్రవల్లి గ్రామంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నాయకుడు పీసరి మనోమర్‌రెడ్డితో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి బూత్‌లో 200, మండల స్థాయిలో 10 వేలకు తగ్గకుండా సభ్యత్వాలు నమోదు చేయించాలని సూచించారు. బీజేపీ మాత్రమే దేశం కోసం, ధర్మం కోసం పనిచేస్తుందన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాల పట్ల ఆకర్షితులై నేడు యువకులు, మహిళలు పెద్ద ఎత్తున తమ పార్టీలో సభ్యత్వం పొందుతున్నారన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం మండల అధ్యక్షుడు దాదె మహేశ్, ప్రధాన కార్యదర్శి హరీశ్, నాయకులు నరేశ్, నవీన్, విష్ణు, రాము, రఘు, నరేశ్, తదితరులు ఉన్నారు.

బీజేపీతోనే అన్ని వర్గాలకు సమన్యాయం

శంకర్‌పల్లి: బీజేపీతోనే అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతుందని బీజేపీ మండల అధ్యక్షుడు రాములుగౌడ్ అన్నారు. మంగళవారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా మండలంలోని గాజులగూడ, లక్ష్మారెడ్డి గూడ, అలంఖాన్ గూడ్ గ్రామాల్లో వారు పర్యటించి, పలువురికి సభ్యత్వం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఇంటింటికీ తెలియజేయాలని పిలుపునిచ్చారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలందరూ సమష్టిగా ఉండి గెలుపొందాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్‌రెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, బీర్ల నర్సింహ, వెంకటేశ్, భోజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.